## గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

### – అదనపు కలెక్టర్ విద్యాచందన


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 6: మండలంలోని క్రాంతినగర్ గొత్తికోయ గ్రామాన్ని అదనపు కలెక్టర్ విద్యాచందన శనివారం సందర్శించారు. మండల స్థాయి అధికారులతో కలిసి ఆ గ్రామానికి వెళ్లిన ఆమె.. గ్రామంలోని తాగునీటి సమస్యలు, ఇతర మౌలిక సదుపాయాల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చేతిపంపుతోపాటు బావి, సోలార్, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విన్నవించుకున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అధికారులు చలపతి, వెంకట్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్**

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 6: మండలంలోని గట్టుమల్ల పంచాయతీ పరిధి గొత్తికోయ గ్రామంలోని గంగమ్మకాలనీ అంగన్‌వాడీ కేంద్రా న్ని అదనపు కలెక్టర్ విద్యాచందన శనివారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు అశోకకుమారి, బానోత్ జ్యోతి పాల్గొన్నారు.

## ఉగాది కవులకు 10న బహుమతుల ప్రదానం

పాల్వంచ, ఏప్రిల్ 6: క్రోధి నామ తెలుగు సంవత్సరాది (ఉగాది) సందర్భంగా పాల్వంచ కళా పరిషత్ ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల స్థాయిలో ఇటీవల నిర్వహించిన కవితల పోటీల ఫలితాలను న్యాయ నిర్ణేతలు శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా కళా పరిషత్ బాధ్యుడు శిరంశెట్టి కాంతారావు మాట్లాడుతూ.. పాల్వంచ వేణుగోపాల్ థియేటర్ ప్రాంగణంలో ఈ నెల 10న సాయంత్రం జరిగే ఉగాది ఉత్సవాల వేదికపై విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. విజేతలు ఆ వేదికపై తమ కవితలను వినిపించాల్సి ఉంటుందని అన్నారు.

## రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

భద్రాచలం, ఏప్రిల్ 6: భద్రాద్రి దివ్యక్షేత్రంలో శనివారం అంతరాలయంలోని మూలవరులకు అర్చకులు స్వర్ణ తులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం నిత్య పూజలు జరిపారు. అనంతరం బేడా మండపంలో స్వామివారికి కల్యాణం నిర్వహించి, కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

**రామయ్యకు వెండి గిన్నె అందజేత**


ఈవోకు వెండి గిన్నె అందజేస్తున్న దాత, కుటుంబ సభ్యులు

భద్రాచలం సీతారామచంద్రస్వామివారికి శనివారం విజయవాడ కరెన్సీనగర్‌కు చెందిన ఎన్ బాలసరస్వతి 658 గ్రాముల బరువు కలిగిన రూ.60వేల విలువైన వెండి గిన్నెను శనివారం దేవస్థానం ఈవో రమాదేవికి అందజేశారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన వారు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారి లింగాల సాయిబాబా, వేద పండితులు ఎస్టీజీ కృష్ణమాచార్యులు, హనుమత్‌శాస్త్రి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఢీకొట్టి దూసుకెళ్లిన మృత్యువు

బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన కారు..

బాధితులపై నుంచి వెళ్లిన లారీ..

తండ్రికి తీవ్రగాయాలు.. తల్లీ, ఇద్దరు కుమార్తెలు దుర్మరణం..

మృతులు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వాసులు

దమ్మపేట, ఏప్రిల్ 6: బైక్‌పై వెళ్తున్న కుటుంబాన్ని మృత్యువు వెంటాడినట్లుగా చోటు చేసుకున్న హృదయవిదారక ఘటన భద్రాద్రి జిల్లాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన ఓ కారు.. ముందువెళ్తున్న మోటారు సైకిల్‌ను వేగంగా ఢీకొట్టగా.. దాని వెనుకనే అదే వేగంతో వచ్చిన ఓ లారీ బాధితుల పైనుంచి దూసుకెళ్లింది. ఈ ఘటనలో తండ్రి తీవ్రంగా గాయపడగా.. తల్లి, ఇద్దరు కుమార్తెలు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీ ఎన్టీఆర్ జిల్లాలోని ఏ.కొండూరు మండలం చీమలపాడుకు చెందిన చీపు బాలకృష్ణ, లక్ష్మి (30) భార్యాభర్తలు. వీరికి శరణ్య (8), షణ్మిత శ్రీ (6) అనే కుమార్తెలున్నారు. అయితే బాలకృష్ణ, లక్ష్మి కలిసి కోళ్లఫారంలో పనిచేసేందుకు శనివారం రాత్రి తమ కుమార్తెలను తీసుకొని భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట వైపు మోటారుసైకిల్‌పై వెళ్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న మోటార్‌సైకిల్ దమ్మపేట మండలం మందలపల్లి క్రాస్‌రోడ్డు దాటి జాతీయ రహదారిపై ప్రభు నర్సరీ వద్దకు చేరుకుంటోంది. ఈ క్రమంలో వెనుక నుంచి దూసుకొచ్చిన ఓ కారు వేగంగా వీరి మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో వీరు ఎగిరి రోడ్డుపై పడిపోయారు. ఆ వెనుకనే అదే వేగంతో వస్తున్న ఓ లారీ.. లక్ష్మి, శరణ్య, షణ్మితశ్రీల పైకి ఎక్కి వెళ్లింది. దీంతో వారు నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందారు. కొంచెం దూరంలో పడిన బాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఈ ప్రమాదాన్ని గమనించి పరుపరుగున ఘటనా స్థలానికి వచ్చారు. తీవ్రంగా గాయపడిన బాలకృష్ణను 108 అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన కారును, లారీను దమ్మపేట పోలీసులు స్వాధీం చేసుకున్నారు. ఈ ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అన్నదాతల ఆత్మహత్యలపైనా స్పందించరా?




మణుగూరుటౌన్: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రేగా కాంతారావు, భద్రాచలం: ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కొత్తగూడెం అర్బన్: కొత్తగూడెంలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

- నాలుగు నెలల్లో 200 మంది ప్రాణాలు వదిలినా పట్టింపు లేదా?
- పంటల పరిశీలన ఎన్నడు? రైతులను ఆదుకునేదెప్పుడు?
- జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వంపై భగ్గుమన్న బీఆర్‌ఎస్

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 6: అన్నదాతల ఆత్మహత్యలు చేసుకుంటున్న తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడంలేదని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించారు. సాగునీరు లేక పంటలు నిలువునా ఎండిపోతున్నా ఈ ప్రభుత్వం పట్టింపులేకుండా వ్యవహరిస్తోందని ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియ, రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. అన్నదాతల సమస్యల పరిష్కారం కోసం బీఆర్‌ఎస్ అధినేత పిలుపు మేరకు శనివాం రైతు భరోసా దీక్ష నిర్వహించారు. కొత్తగూడెంలో వనమా వెంకటేశ్వరరావు ఆదేశాలతో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు కొత్తగూడెం అమరవీరుల స్థూపం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు సంకుబాపన అనుదీప్, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ మాట్లాడారు. 420 అబద్దాల పునాదులపై ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నాలుగు నెలల కాలంలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలనూ తీవ్ర ఇబ్బందులు గురిచేస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. రైతు వ్యతిరేక నిర్ణయాల కారణంగా ఈ నాలుగు నెలల కాలంలో సుమారు 200 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు బదావత్ శాంతి, భూక్యా సోనా, ఎస్‌కే అన్వర్‌పాషా, తొగరు రాజశేఖర్, అంబుల వేణు, బొమ్మిడి శ్రీకాంత్ యాదవ్, దుర్గ, పిల్లి కుమార్, పూర్ణ, నాగేందర్, సింధు తపస్వీ, మంజుల దుర్గాప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారు: హరిప్రియ**

ఇల్లెందు, ఏప్రిల్ 6: రాష్ట్రంలోని రైతులు, సామాన్య ప్రజలకు సాగు, తాగునీరు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు తిరగబడి బుద్ధి చెబుతారని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ హెచ్చరించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక చర్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం జగదాంబ సెంటర్‌లో రైతు నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో మహబుబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బింధు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, బయ్యారం, టేకులపల్లి, గార్ల మండలాల అధ్యక్షులు తాతా గణేశ్, వరప్రసాద్, లక్ష్మణ్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

**ప్రజలను నట్టేట ముంచిన కాంగ్రెస్: రేగా**

మణుగూరు టౌన్, ఏప్రిల్ 6: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి ఓటు వేసినందుకు ప్రజలను నట్టేట ముంచారని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శనివారం పట్టణంలో ఆయన బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి రైతు భరోసా దీక్ష నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై బైఠాయించి, రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ రాఘవరెడ్డికి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం రేగా మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉచిత కరెంటు అందిందని, రాష్ట్రంలో ఎక్కడా కూడా కరెంటు పోయిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల కంట కన్నీరు కారుతుందని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్‌ఎస్ మణుగూరు మండల, పట్టణ అధ్యక్షుడు ముత్యం బాబు, అడపా అప్పారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, నాయకులు, పగడాల సతీశ్‌రెడ్డి, వట్టం రాంబాబు నాయకులు పాల్గొన్నారు.

**వరికి రూ.500 బోనస్ చెల్లించాలి: మెచ్చా**

అశ్వారావుపేట, ఏప్రిల్ 6 : వరికి రూ.500 బోనస్ చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎండిన పంటలకు పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఎకరాకు రూ.25 వేలు నష్ట పరిహారం అందించాలని, సాగర్ జలాలతో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పి.కృష్ణప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపీపీ చిట్లూరి ఫణీంద్ర, బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్‌రావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సంకా ప్రసాద్, నాయకులు జేకేవీ రమణారావు, రాజమోమన్‌రెడ్డి, సంపూర్ణ, వెంకన్నబాబు, రాజశేఖర్, యుగంధర్, బాబు, జిన్నా, బజారయ్య, చరణ్, బుచ్చిబాబు, రాంబాబు, శ్రీరామ్మూర్తి, లక్ష్మయ్య, సూరి, హరి, రూపా పాల్గొన్నారు.

**ఎన్నికల హామీలను నెరవేర్చాలి: బీఆర్‌ఎస్ నాయకులు**

భద్రాచలం, ఏప్రిల్ 6: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, వరి పంటకు రూ.500 బోనస్ చెల్లించాలని, ఎండిపోయిన పొలాలకు ఎకరానికి రూ. 25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ భద్రాచలం నియోజకవర్గ శ్రేణుల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం భద్రాచలం ఆర్డీవో దామోదరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, తాండ్ర రమణ, వాసురాజు గంపా రాంబాబు, పిల్లారిశెట్టి మురళి పాల్గొన్నారు.

# ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు


చర్ల: రంగోలీ, మెహందీ పోటీల్లో పాల్గొన్న మహిళలు

అశ్వారావుపేట, ఏప్రిల్ 6: సమర్థ పాలకులను ఎన్నుకోవడానికి రాజ్యాంగం పౌరులకు ఓటుహక్కు కల్పించిందని, అటువంటి ఓటును నిర్లక్ష్యం చెయ్యవద్దని తహసీల్దార్ పి.కృష్ణప్రసాద్, ఎంపీడీవో జి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్, సెర్ప్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ముగ్గులు, మెహందీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో రోజా రాణి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సెర్ప్ సీసీలు పాల్గొన్నారు.

**అన్నపురెడ్డిపల్లిలో..**

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 6: ఓటుహక్కు చాలా ప్రాముఖ్యమైనదని జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో రంగారావు అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ, సెర్ప్ సిబ్బంది ఆధ్వర్యంలో రంగవల్లులు వేసి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రత్యేకాధికారి ప్రదీప్, ఏపీఎం రాంభద్రయ్య, అంగన్‌వాడీ, సెర్ప్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

**చర్లలో..**

చర్ల, ఏప్రిల్ 6: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీడీపీవో చైతన్య అన్నారు. చర్ల మండలం కొయ్యూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు రంగోలీ మెహందీ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది. గ్రామ దీపికలు, కొయ్యూరు మాజీ సర్పంచ్ దుబ్బా కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

**బూర్గంపహాడ్‌లో..**

బూర్గంపహాడ్, ఏప్రిల్ 6: ఓటును ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకుని వినియోగించుకోవాలని ఎంపీడీవో జమలారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మోరంపల్లిబంజర బస్టాండ్, బూర్గంపహాడ్‌లోని ప్రధాన కూడలిలో ఓటు ప్రాముఖ్యత కోసం సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవో సమ్మయ్య, కార్యదర్శి భవానీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

**చండ్రుగొండలో..**

చండ్రుగొండ, ఏప్రిల్ 6: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని ఎంపీడీవో అశోక్ అన్నారు. శనివారం చండ్రుగొండ ప్రధాన సెంటర్‌లో సి-విజిల్ యాప్‌పై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ సెక్రటరీ ఉపేందర్, సారేపల్లి శేఖర్ పాల్గొన్నారు.

**లక్ష్మీదేవిపల్లి, పాల్వంచలో..**

లక్ష్మీదేవిపల్లి/ పాల్వంచ, ఏప్రిల్ 6: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాల్లోని పలు గ్రామాల మహిళలకు శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలను ఐసీడీఎస్ సీడీపీవో రేవతి పరిశీలించారు. అధికారులు వసంత, అనసూయ, రత్నకుమారి, శారద, కవిత, సుభాశ్ చంద్రబోస్, రాంబాబు, శ్రీను, రవికుమార్, పద్మావతి పాల్గొన్నారు.

## పేద ముస్లింలకు చీరెల పంపిణీ


మహిళలకు చీరెలు అందజేస్తున్న ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

భద్రాచలం, ఏప్రిల్ 6: ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పేద ముస్లింల మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. పట్టణంలోని ముస్లిం సోదరుల ఆర్థిక సాయంతో స్థానిక సుభాష్‌నగర్ కాలనీలోని కారేపల్లి బజార్‌లో ఉన్న మజీద్ ఏ జమాన్‌లో, అశోక్‌నగర్ కాలనీలో ఉన్న మదర్సా జామియా ఇస్లామియాలో అర్హులైన పేద ముస్లింలకు రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని చీరెలు పంపిణీ చేశారు. ఎస్కే ఉస్మాన్, ఇల్యాబక్షి, మహమ్మద్ బాబాజీ, పాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ: సాబీర్‌పాషా

మణుగూరుటౌన్, ఏప్రిల్ 6: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. ఆయన శనివారం మణుగూరు పార్టీ కార్యాలయంలో సరెడ్డి పుల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు పెద్దపీట వేస్తూ సామాన్యులపై జీఎస్టీ భారం మోపుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## శ్రమలేని జీవితంతోనే అనేక వ్యాధులు

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 6: నేడు శ్రమలేని జీవితంతోనే అనేక వ్యాధులు వస్తున్నాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ అన్నారు. శనివారం ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, భాగ్య హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ చెంచురత్నయ్య, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

## 'బీజేపీ ప్రయత్నాలను అడ్డుకుంటాం'

పాల్వంచ, ఏప్రిల్ 6: హిందూ ధర్మం పేరుతో కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలనే ప్రయత్నాన్ని అడ్డగిస్తామని తెలంగాణ బహుజన ఐక్య వేదిక కన్వీనర్ బరిగడ దేవదానం, సభ్యులు చిటికెన ముసలయ్య, నబీ సాహెబ్ స్పష్టం చేశారు. పాల్వంచలోని ఐక్యవేదిక కార్యాలయంలో అధ్యక్షుడు శ్రీపాద సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగిన వేదిక సమావేశంలో వారు మట్లాడారు. కులమతాలను రెచ్చగొడుతున్న బీజేపీ.. ప్రజల్లో కక్షలను పెంచేందుకు కారణమవుతోందని అన్నారు. మణిపూర్ వంటి ఘటనలే ఇందుకు ఉదాహరణలని గుర్తుచేశారు.

## ఆదివాసీ జేఏసీ కమిటీ ఏర్పాటు

అశ్వాపురం, ఏప్రిల్ 6: ఆదివాసీ జేఏసీ మండల నూతన కమిటీని ఆదివాసీ నాయకులు శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్లూరి నర్సింహారావు, ఉపాధ్యక్షుడిగా తోకల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సప్క నరేశ్, కోశాధికారిగా బండ్ల రామచంద్రయ్య, సహాయ సలహాదారునిగా సోడే రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## గొత్తికోయ గ్రామాల్లో అధికారుల పర్యటన


పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచ, ఏప్రిల్ 6: ఈ వేసవిలో గొత్తికోయ గ్రామా ల్లో అక్కడి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆయా శాఖల అధకారులు శనివారం ఆ గ్రామంలో పర్యటించారు. చిరుతానుపాడు, ఉల్వనూరు, పెద్ద కలస గొత్తికోయ గ్రామాల్లోని తాగునీటి సమస్యలను మిషన్ భగీరథ ఈఈ తిరుమలేశ్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఏఈ నీలావతి తదితరులు పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలు ప్రస్తుతం తాగునీటిని ఎక్కడి నుంచి తెచ్చుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌కు అంచనాలు పంపించి ఆయా గ్రామాల్లో నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు రణధీర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


పర్ణశాల: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ ఏపీఎం హేమంత్

టేకులపల్లి, ఏప్రిల్ 6: మండలంలోని గొల్లపల్లి, సంపత్‌నగర్ గ్రామాల్లో సెర్ప్ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో జీ రవీందర్‌రావు, మండల వ్యవసాయ అధికారిణి అన్నపూర్ణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి గ్రేడ్ -ఏ రకము రూ.2,203, సాధారణ రకము రూ.2,183ల చొప్పున క్వింటా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వర్లు, ఏఈవో రెహానబేగం, ఏపీఎం రవికుమార్, సీసీలు నరేశ్, సావిత్రి, వీవోఏలు రోజా, సుజాత, కమిటీ సభ్యులు భవాని పాల్గొన్నారు.

**బైరాగులగూడెంలో..**

పర్ణశాల, ఏప్రిల్ 6: దుమ్ముగూడెం మండల పరిధిలోని బైరాగులగూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఏపీఎం హేమంత్ ప్రారంభించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని, దళారులను నమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం అమ్మాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

**అన్నపురెడ్డిపల్లిలో..**

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 6 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని, నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు ప్రశాంత్, సంధ్యారాణి, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## తునికాకు సేకరణ చేపట్టాలి

అశ్వారావుపేట, ఏప్రిల్ 6 : ఏజెన్సీ ప్రాంతంలో తునికాకు సేకరణ చేపట్టి ఆదివాసీలకు ఉపాధి కల్పించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథ) పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, జిల్లా నాయకుడు కంగాల కల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు తునికాకు సేకరణలో కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వాసం బుచ్చిరాజు, కంగాల భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 21న భద్రాద్రిలో సంగీత స్వరార్చన

భద్రాచలం, ఏప్రిల్ 6: ట్రూ టాలెంట్ సింగర్స్ గ్రూప్, భద్రాద్రి మెలోడి సింగర్స్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 21న భద్రాచలంలో అహోబిల నారసింహ మఠంలో కర్ణాటక శాస్త్రీయ సంగీతం పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కన్వీనర్ బెల్లంకొండ దుర్గా కోమలి, జేఆర్ మూర్తి తెలిపారు. విజేతలకు పారితోషికంతో పాటు మెమెంటో, ధృవపత్రం అందజేస్తామని వారు పేర్కొన్నారు. ఈ స్వరార్చన కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రాలను రామాలయ ఈవో ఎల్ రమాదేవి ఆవిష్కరించారు.

## జగదాంబ దేవి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవం

పాల్వంచ, ఏప్రిల్ 6: మున్సిపాలిటీలోని శ్రీ జగదాంబ దేవి అమ్మవారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ బాధ్యులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఛండీహోమం నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలు సమర్పించారు. ఆలయ బాధ్యులు తేజావత్ రాములు, నిరోష, కుడిక్యాల ఆంజనేయులు, ప్రసాద్, వీరస్వామి, కిశోరి మంజు, దేశ్యా సాదు పాల్గొన్నారు.

## నవమి పనులను పరిశీలించిన ఎంపీడీవో

పర్ణశాల, ఏప్రిల్ 6: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో ఏప్రిల్ 17న జరిగే నవమి ఏర్పాట్లను దుమ్ముగూడెం ఇన్‌చార్జి ఎంపీడీవో ఈదయ్యా శనివారం పరిశీలించారు. పంచాయతీ ఆధ్వర్యంలో జరిగే పారిశుధ్య పనులు, శానిటేషన్ పనులు, ఏయే ప్రాంతాల్లో చేయాలని పరిశీలించారు. నార చీరెల ప్రాంతం వద్ద భక్తుల కోసం ఎండలను దృష్టిలో పెట్టుకొని తాగునీటి సౌకర్యం, భక్తుల విశ్రాంతి కోసం టెంట్లు ఏర్పాటు చేశారు. హెల్త్ క్యాంపులు, పార్కింగ్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఏడు లారీల ఇసుక నిల్వలు సీజ్

పాల్వంచ, ఏప్రిల్ 6: మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. గుడిపాడు, కుంటినాగులగూడెం పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు ఏడు లారీల ఇసుకను అధికారులు శనివారం పరిశీలించారు. అనుమతులు లేకుండా తరలించి నిల్వ ఉంచినట్లు గుర్తించి ఇసుకను సీజ్ చేశారు.

## మట్టి ట్రాక్టర్ సీజ్

అశ్వారావుపేట, ఏప్రిల్ 6: అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని గుర్రాలచెరువు-మొద్దులగూడెం నుంచి శనివారం అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ కృష్ణప్రసాద్ సిబ్బందితో తనిఖీలు చేయించారు. ట్రాక్టర్‌కు అనుమతి లేకపోవడంతో సీజ్ చేసి కార్యాలయానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేట, ఏప్రిల్ 6: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం పట్టుకున్నారు. మండలంలోని కొత్తూరు గ్రామ సమీపంలోని పెదవాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ దాడి చేసి పట్టుకున్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని వల్లెపు దుర్గా ప్రసాద్, డ్రైవర్ జగదీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## 17 నుంచి సంత రద్దు

సారపాక, ఏప్రిల్ 6: బూర్గంపహాడ్ పంచాయతీ పరిధిలో ఇప్పటివరకు ఏర్పాటు చేసిన సంతను ఈ నెల 17 నుంచి పూర్తిగా రద్దు చేస్తున్నామని బూర్గంపహాడ్ పంచాయతీ ఈవో సమ్మయ్య శనివారం తెలిపారు. పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలం లేనందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## ఈపీ ఆపరేటర్ల పదోన్నతులకు చర్యలు తీసుకోవాలి

మణుగూరు టౌన్, ఏప్రిల్ 6: ఓసీ గనుల్లో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్ల పదోన్నతులకు చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఈపీ ఆపరేటర్ల ఆధ్వర్యంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆపరేటర్లు ఎస్డీ నాసర్‌పాష, నన్నేవేణి సురేశ్, కోడి పుంజుల రాజేందర్, కార్మిక సంఘాల నాయకులు మేకల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓడీ మస్టర్ కట్టివ్వాలని మేనేజర్‌కు వినతి

రామవరం, ఏప్రిల్ 6: సింగరేణి వ్యాప్తంగా ఉన్న వివిధ ఏరియాల నుంచి కొత్తగూడెం ఏరియా పీవీకే5 ఇంక్లైన్‌కు బదిలీపై వచ్చిన జనరల్ మజ్దూర్లకు గత నెలకు సంబంధించిన ఓడీ మస్టర్ కట్టివ్వాల్సిందేనని ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ మల్లికార్జున్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పిట్ సభ్యులు హుమాయున్, నాగేశ్వరరావు, కుమార్‌కృష్ణ, దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
Classifieds

WANTED

jobs Apply Now!

★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

లీజుకు ఇవ్వబడును

1).గొల్లగూడెంలో కాలేజీలకు, స్కూలుకు ఉపయోగపడే ఒక ఎకరం ల్యాండ్ కాంపౌండ్, సోలార్ ఫెన్సింగ్‌తో లీజుకు ఇవ్వబడును. 2).ఇల్లెందు మెయిన్‌రోడ్డు, జయనగర్, HP పెట్రోల్ బంక్ ఎదురుగా, 2000 గజాలు లీజుకు ఇవ్వబడును.
CELL: 9642097979

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616